

ఎల్బీనగర్‌లోని కాకతీయ పాఠశాలలో..

పాఠశాలల్లో క్రిస్మస్ సందడి



దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం నారాయణ పాఠశాలలో మంగళవారం క్రిస్మస్ వేడుకలు సందడిగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు శాంతాక్లాజ్, ఏంజిల్ వేషధారణలో ఆకట్టుకున్నారు. క్రిస్మస్ వేడుకలు నిర్వహించి క్రిస్మస్ పండుగ ప్రత్యేకత గురించి వివరించారు.పాఠశాల ఏజీఎం హేమాంబర్, ఆర్ఐ రవిప్రసాద్, ప్రిన్సిపల్ నీరజ, ఆర్డీ మీనా, సమన్వయ కర్త శిరీష, ఏఓ రమేష్, ఏడీ స్వామి, వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణలత, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

హయత్‌నగర్: మత్తు పదార్థాలు వాడే వారేపై ప్రత్యేక నిఘా ఉంచామని యాంటీ నార్కోటిక్ డైరెక్టర్ సందీప్ శాండిల్య అన్నారు. హయత్‌నగర్‌లోని వర్డ్ అండ్ డీడ్ పాఠశాలలో మంగళవారం నార్కోటిక్ డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ వాడకాన్ని ఉక్కుపాదంతో అణిచి వేసి డ్రగ్స్ వాడకం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. నూతన సంవత్సర వేడుకలను నిర్వహించే హోటళ్లు, రిసార్ట్స్, పబ్‌లపై నిఘా పెంచుతున్నామని, ఎక్కడ మత్తు పదార్థాలు వినియోగం జరిగినా కఠిన చర్యలు తప్పవన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రవర్తనను గమనించి వారికి ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన సమంజసమే

హస్తినాపురం: రాష్ట్రంలో విద్యాశాఖ సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి వారికి పేస్కేలు ఇవ్వాలని చేస్తున్న నిరసన సమంజసమేనని తమ మద్దతు వారికి ఉంటుందని ఉమ్మడి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. సంఘం ప్రతినిధులు మంగళవారం జస్టిస్ చంద్రకుమార్‌ను కలిసి తమకు మద్దతు తెలపాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. సమగ్ర శిక్షా ఉద్యోగులకు

జస్టిస్ చంద్రకుమార్

ఉద్యోగ భద్రతతో పాటు వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. గత 18 ఏళ్ల నుంచి 19,600 మందికిపైగా పాఠశాలల విద్య మెరుగుకు పనిచేస్తున్నారని వారిని ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉందదన్నారు. వినతిఇచ్చిన వారిలో దుండిగల్ యాదగిరి, జి.ఝాన్సీ సౌజన్య, ఆర్.సహదేవ్, రమేశ్, కె.మహదేవ్ ఉన్నారు.



విద్యుత్ దీపాలతో దగదగ లాడుతున్న వనస్థలిపురంలోని లిటిల్ ల్యాంబ్ చర్చి

క్రిస్మస్ కాంతులు

ప్రత్యేక ప్రార్థనలకు ముస్తాబైన చర్చిలు



నల్గొండ క్రాస్‌రోడ్డులోని బెతిలిహేన్ మిన్నొనిట్ బ్రితెర్న్ చర్చి

దిల్‌సుక్‌నగర్: అంతట క్రిస్మస్ సందడి నెలకొంది. ఆయా ప్రాంతాల్లోని చర్చిలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. బుధవారం (నేడు) నిర్వహించే ప్రత్యేక ప్రార్థనల కోసం చర్చిలలో నిర్వాహకులు అన్ని ఏర్పాటు చేశారు. క్రైస్తవ సోదరులు తమ తమ ఇళ్లపై స్టార్స్ ఏర్పాటు చేసుకున్నారు.


- మలక్‌పేట్ నల్గొండ క్రాస్‌రోడ్డులోని బెతిలిహేన్ మిన్నొనిట్ బ్రితెర్న్ చర్చి, మూసారంబాగ్‌లోని బాప్టిస్ట్ చర్చి,సైదాబాద్ కాలనీలోని బేతేలు చర్చి, మలక్‌పేటలోని బెథాని బాప్టిస్ట్ చర్చి, దిల్‌సుక్‌నగర్ బాప్టిస్ట్ చర్చి, గడ్డిఅన్నారం, మీర్‌పేట్, అక్బర్‌బాగ్, ఆర్‌కేపురం, సరూర్‌నగర్, జల్‌పల్లి చర్చిలను సుందరంగా అలంకరించారు.

వనస్థలిపురం,బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ల పరిధిలో..

వనస్థలిపురం: క్రిస్మస్ నేపథ్యంలో వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ల పరిధిలోని చర్చిలను అందంగా ముస్తాబు చేశారు. దీంతో ఆయా ప్రాంతాలలో క్రిస్మస్ సందడి నెలకొంది. పండగను పురస్కరించుకుని వనస్థలిపురంలోని లిటిల్ ల్యాంబ్ చర్చిని విద్యుత్ దీపాలతో అందంగా తీర్చిదిద్దారు. చర్చి ప్రాంగణంలో కిస్మస్ చెట్టును అందంగా ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి నుంచి క్రిస్మస్ వేడుకలు ప్రారంభం అవుతాయని బుధవారం చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు.



లిటిల్ ల్యాంబ్ చర్చిలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ



ప్రార్థనల కోసం సిద్ధమైన దిల్‌సుఖ్‌నగర్‌లోని చర్చి

పోతులూరి కాలజ్ఞానం సమాజానికి అవసరం



దిల్‌సుఖ్‌నగర్: పోతులూరి వీరబ్రహ్మం కాలజ్ఞానం నేటి సమాజానికి ఎంతో అవసరమని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ తెలిపారు. పోతులూరి ఈశ్వరీదేవీ ఆరాధన ఉత్సవాల సందర్భంగా కొత్తపేట్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ ఆడిటోరియంలో మంగళవారం పోతులూరి వీరబ్రహ్మం విశిష్టత నేటి ఆవశ్యకత అనే అంశంపై జరిగిన సమావేశంలో జూలూరు పాల్గొని ప్రసంగించారు. కుల మతాలకతీతంగా సమానత్వాన్ని చాటి చెప్పిన జ్ఞాని పోతులూరి వీరబ్రహ్మం అన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డీవీ సుబ్బారావు మాట్లాడుతూ.. బ్రహ్మం తాత్వికత ఆయన వేదాలను సులభతరమైన భాషలో ప్రజలకు అందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ సేవా సమితి అధ్యక్షుడు రవీంద్రాచారి, విశ్వబ్రాహ్మణ సంఘం మాతృ సంస్థ గౌరవ అధ్యక్షులు లాల్ కోట వెంకటాచారి, మదన్మోహన్ , కుందరపు గణేశాచారి పాల్గొన్నారు.

ప్రారంభమైన యజ్ఞ మహోత్సవాలు

మన్సూరాబాద్: వైదిక విజ్ఞాన ట్రస్ట్, ధర్మ రక్ష సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నాగోలు డివిజన్ పరిధి జనప్రియ ఎన్‌క్లేవ్ కాలనీ పార్కులో రుగ్వేద, యజుర్వేద, సామవేద హవన సహిత గజేంద్ర మోక్ష ప్రవచన పాంచాహ్నిక యజ్ఞ మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం వేదహావనం, గోపూజ, గురువందనం, గణపతిపూజ, అంకురార్పణ, అగ్నిప్రతిష్ట కార్యక్రమాలను నిర్వహించారు. భద్రచల ఆస్థాన వేద పండితులు, ఉభయ వేదాంత విద్వాన్ గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యుల ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. మంగళవారం నుంచి ఆదివారం వరకు మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వాడ్రెవు శ్రీనివాసరావు, చిట్టి హనుమత్‌శాస్త్రీ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి వినతి

నాగోలు: కొత్తపేట డివిజన్ పరిధి వివిధ కాలనీలలోని డ్రైనేజీ, తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ మంగళవారం జలమండలి ప్రధాన కార్యాలయంలో జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలలో డ్రైనేజీ లైన్ పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా ఇంకా రోడ్లకు మరమ్మతు చేయకపోవడంతో గుంతలమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. రాజీవ్‌గాంధీ నగర్ ఫేస్-1లో సరైన తాగునీటి సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అల్కాపురి సిగ్నల్ నుంచి రాజీవ్‌గాంధీ నగర్ ఫేస్-1 హనుమాన్ టెంపుల్ మెయిన్ రోడ్ వరకు నూతన లైన్లు మంజూరు చేయాలని వినతిలో పేర్కొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి కృషిచేయాలి

నాగోలు: ఆర్టీసీ డిపో అభివృద్ధికి ఉద్యోగులు కృషి చేయాలని బండ్లగూడ మేనేజర్ వెంకటేశం అన్నారు. మంగళవారం డిపోలో నిర్వహించిన ప్రగతిచక్రం అవార్డు కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు అవార్డులు అందజేశారు.ఇంధనపొదుపులో డ్రైవర్లు, అత్యధిక ఆదాయం సాధించి కండక్టర్లు, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయక మేనేజర్ శాలిని, మెకానికల్ ఇంజినీర్ బాల యోగేశ్వరి డిపో సిబ్బంది పాల్గొన్నారు.

మ్యాన్‌హోళ్లకు మరమ్మతు షురూ



సాక్షి ఎఫెక్ట్..

చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్ మధురాపురి కాలనీలోని స్వర్ణకారవీధిలో మూడు మ్యాన్‌హోళ్లు కుంగి ప్రమాదకరంగా మారాయి. మరమ్మతు చేయాలని స్థానికులు పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఈ సమస్యపై ఈ నెల 9న సాక్షిలో 'ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్లు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. మంగళవారం కుంగిపోయిన మాన్‌హోళ్లకు మరమ్మతు చేపట్టారు. సమస్య పరిష్కారం అయ్యేలా చొరవ చూపిన సాక్షికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

విలువలతో కూడిన విద్యా బోధన ముఖ్యం

దిల్‌సుఖ్‌నగర్: విలువలతో కూడిన విద్యా బోధన ఎంతో ముఖ్యమని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం కొత్తపేటలో నిర్వహించిన ఆర్‌కేపురం భాష్యం పాఠశాల 14వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి యువత, విద్యార్థులు సెల్‌ఫోన్లు, ఐప్యాడ్, కంప్యూటర్ లాంటి వాటికి వీలైనంత వరకు దూరంగా ఉండాలన్నారు. భాష్యం సీఈవో చైతన్య మాట్లాడుతూ.. తమ పాఠశాలలో విద్యా విధానం విద్యార్థుల సర్వముకాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అప్పారావు, లిటిల్ చాంప్స్ ప్రిన్సిపాల్ అనుపమ, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

హయత్‌నగర్: డా.బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్‌షాను కేంద్ర కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కృష్ణయ్య డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం హయత్‌నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రపంచ మేధావి అంబేడ్కర్‌పై ఇష్టానుసారంగా మాట్లాడిన అమిత్‌షా దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీశారని, ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పుల్లయ్య, మహేందర్, జానమ్మ, పృథ్వీరాజ్, శ్యాం సుందర్‌రెడ్డి, నరసింహ్మారావు, వెంకటేష్, పెంటయ్య పాల్గొన్నారు.

ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలి

హయత్‌నగర్: బేడ బుడగ జంగాలతో పాటు ఎస్సీ, ఎస్టీ కులాల్లోని సంచార జాతులను కలిపి వారికి 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్ర బేడ బుడగ జంగాల హక్కుల పోరాట సమితి నాయకులు మంగళవారం రాష్ట్ర ఎస్సీ వర్గీకరణ చైర్మన్ జస్టిస్ షమీం అఖ్తర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 50 ఏళ్లుగా సంచార జాతి కులాలకు రిజర్వేషన్ ఫలాలు అందకపోవడంతో అన్ని విధాలుగా వెనకబడిపోయామన్నారు. వినతి ఇచ్చిన వారిలో సిరిగిరి మన్యం, కొడిగంటి నర్సింహా, సహదేవుడు అనీల్ చిన్న కోటయ్య, రాజు బన్ని ఉన్నారు.

రోడ్డు మరమ్మతు పనుల పరిశీలన

ఎల్బీనగర్: తన దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా కృషి చేస్తానన బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు.డివిజన్ పరిధిలో పలు కాలనీల రోడ్లు గుంతమయంగా మారి ఇబ్బందికరంగా ఉన్నాయని కార్పొరేటర్ దృష్టికి రావడంతో రెండ్రోజుల క్రితం అధికారులతో కలిసి పరిశీలించి రోడ్లకు మరమ్మతు చర్యలు చేపట్టగా మంగళవారం ఆయన పనులను పరిశీలించి మాట్లాడారు. కాలనీలలో మౌలిక సదుపాయాలను దశలవారీగా కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శివశంకర్‌గౌడ్, మొసిన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

సైదాబాద్: డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి తెలిపారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, కాలనీసంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి మంగళవారం ఆమె కళ్యాణ్‌నగర్‌లో పాదయాత్ర చేస్తూ స్థానిక సమస్యలపై ఆరా తీశారు. కాలనీలోని అంతర్గత రహదారులపై ఏర్పడిన గుంతలకు వెంటనే మరమ్మతు చేయాలని అధికారులను ఆదేశించారు. కాలనీలో పలుచోట్ల డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల మూతలు ధ్వంసమయ్యాయని త్వరితగతిలో వాటికి కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులతో చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్పొరేటర్ వెంట జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, వాటర్‌వర్క్స్ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ మనోహర్, శ్రీనివాస్, గోవిందరాజు, స్వాతి పాల్గొన్నారు.


ఉత్సాహంగా స్పోర్ట్స్ మీట్



వనస్థలిపురం: యువ జూనియర్ కళాశాలలు వనస్థలిపురం, దిల్‌సుఖ్‌నగర్ బ్రాంచిల విద్యార్థులకు స్పోర్ట్స్‌మీట్ సందర్భంగా సోమ, మంగళవారాల్లో సరూర్‌నగర్ స్టేడియంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన అంబర్‌పేట మండల ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమన్నారు. కళాశాల డైరెక్టర్ నందికంటి భాస్కర్ మాట్లాడుతూ.. పరీక్షలకు ముందు ఈ క్రీడలు విద్యార్థులకు మనో వికాసాన్ని కలిగిస్తాయన్నారు.

ఇంటి తాళం పగులగొట్టి చోరీ

నాగోలు: తాళం పగలగొట్టి బంగారు, వెండి ఆభరణాలు దోచుకెళ్లిన ఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..మన్సూరాబాద్, హిమాపూరి కాలనీకి చెందిన సోమసాని సతీష్‌రెడ్డి ఈ నెల 23న ఇంటికి తాళం వేసి మలక్‌పేట్‌లోని ఆఫీసుకు వెళ్లి రాత్రి 12.45 ఇంటికి రాగా తాళం పగలగొట్టి ఉంది. అల్మారాలో ఉన్న 40 గ్రాముల బంగారు హారం, వెండి వస్తువులను చోరీ చేసినట్లు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.



రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సందీప్ (ఫైల్)

మలక్‌పేట: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మలక్‌పేటలో పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ వివరాల ప్రకారం.. సలీంనగర్ వెస్ట్‌ప్రశాంత్‌నగర్‌కు చెందిన గడిగె సందీప్(33) స్నేహితులతో కలిసి మూసారంబాగ్‌లో ఉన్న మరో స్నేహితుడి బర్త్‌డే ముగించుకుని ఇంటికి వెళ్లడానికి సోమవారం అర్ధరాత్రి స్వామి వివేకానంద స్కూల్ ఎదురుగా ఉన్న ఓల్డ్ బీఆర్‌ఎస్ ఆఫీస్ వద్ద నిల్చున్నారు. అదే సమయంలో ఓల్డ్‌మలక్‌పేట శంకర్‌నగర్ చెందిన షేక్ షాబాజ్ తన స్నేహితుడితో కలిసి బైక్‌పై మూసారంబాగ్ చౌరస్తా వైపు అజాగ్రత్తగా నిర్లక్ష్యంగా వచ్చి వారిని ఢీకొట్టగా సందీప్‌కు తీవ్ర గాయాలయ్యాయి.ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య స్వల్ప గొడవ చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సందీప్‌ను ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి సోదరుడు సాయికిరణ్‌యాదవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ప్రమాదానికి కారణమైన షేక్ షాబాజ్‌ను అరెస్ట్ చేశారు.

అవయవదానం



పుట్టి జంగయ్య (ఫైల్)

మన్సూరాబాద్: తాను మరణిస్తూ ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపారు ఓ రైతు.జీవన్‌ధాన్ ప్రతినిధులు వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం ముద్వీన్ గ్రామానికి చెందిన పుట్టి జంగయ్య(74) ఈ నెల 19న ఇంట్లో అకస్మాతుగా కిందపడి పోయారు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎల్బీనగర్ కామినేని హాస్పిటల్‌కు తరలించగా ఈ నెల 23 ఉదయం బ్రెయిన్‌డెడ్ అయినట్లు ప్రకటించారు. విషయం తెలుసుకున్న జీవన్‌ధాన్ ప్రతినిధులు జంగయ్య భార్య కేశమ్మ కుటుంబ సభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించి వారి అంగీకారంతో జంగయ్య లివర్, రెండు కిడ్నీలు, రెండు కార్నియాలను జీవన్‌ధాన్ సేకరించింది.







మార్కెట్లను ఆధునికీకరిస్తాం



మార్కెట్‌ను సందర్శించిన లక్ష్మి

చాదర్‌ఘాట్: హైదరాబాద్ మార్కెట్ పరిధిలోని మార్కెట్లను ఆధునికీకరించనున్నట్లు నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చెకొలేకర్ లక్ష్మి పేర్కొన్నారు. మలక్‌పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్, డైరెక్టర్లు మస్రత్ సుల్తానా, మహ్మద షకీల్, దుగ్గ జగదీష్, కిసన్‌సింగ్, పాశం అశోక్‌గౌడ్, పన్నాల రాజేందర్‌రెడ్డితో కలిసి మంగళవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్కెట్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారం, నూతన రోడ్డు వేయించడంతో పాటు, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతామన్నారు. మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు ఏర్పాటు చేయిస్తామన్నారు. రైతులకు నిరంతరం అందుబాటులో ఉండి వారికి గిట్టుబాటు ధరలను అందించడాని కృషి చేస్తామని తెలిపారు.